సమావేశమంటే ఆషామాషీ కాదు

- సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి
- పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవాలి
- నీటి వృథాను అరికట్టాలి
- మండల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

బంట్వారం: 'సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ఆషామాషీగా తీసుకోవద్దు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి' అని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి పలు శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన బంట్వారం మండల సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని, ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. నీటి వృథాను అరికట్టాలని, ఇదే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను బతికిస్తే.. గ్రామాల్లో పచ్చదనం పరుచుకుంటుందని చెప్పారు.

అభివృద్ధి పనులకు సహకారం

రొంపల్లి టూ ఓగులాపూర్ రోడ్డు అధ్వానంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఎంపీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి.. సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన చైర్‌పర్సన్.. ఆర్అండ్‌బీ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. సత్వరమే చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. అనంతరం ఎంపీపీ ప్రభాకర్ పలు సమస్యలను సునీతారెడ్డి దృష్టికి తీసుకురాగా.. ఆమె సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి పనులకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ జితేందర్ రెడ్డి, ఎంఈఓ చంద్రప్ప, ఏఓ సంధ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలంలో..

ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై ఆయా శాఖల అధికారులు సభలో సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో సాగాలి

బంట్వారం మండల అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తాను. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది. మండల పరిషత్ కార్యాలయంలో వసతుల కల్పనకు మరో రూ.5 లక్షలు వెచ్చిస్తాను. తన హయాంలో ఇప్పటి వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలు కట్టించాను. - చైర్‌పర్సన్ సునీతారెడ్డి

ప్రారంభానికి ముందే మరమ్మతు

వంతెనపై తేలిన ఇనుప రాడ్లు

పెద్దేముల్: రహదారుల నిర్మాణం, విస్తరణ కోసం ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చు పెడుతున్నా.. అధికారుల నిర్లక్ష్యంతో వంతెనలు, రహదారులు మున్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారి పెద్దేముల్ మండల బుద్దారం వంతెనపై గతేడాది నిర్మించిన బ్రిడ్జి.. ప్రారంభోత్సవానికి ముందే వంతెనపై ఇనుప కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళలో ఏమాత్రం ఆదమరచినా.. అంతే సంగతులు అని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శతాబ్దకాలం వరకు మన్నికగా ఉండవలసిన వంతెనలు ఇలా ఏడాది కాలానికే బీటలు వారడం, రాడ్లు తేలడంతో నాసిరకం బయటపడిందని, ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వంతెనపై రోడ్డు పటిష్టంగా ఉండేలా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



వంతెనపై తేలిన ఇనుప రాడ్లు.. సిమెంటు వేసి సరిచేసిన అధికారులు

కోట గడ్డను రక్షించండి

యాలాల: పురాతన కాలంలో నిర్మించిన కోటగడ్డను కొందరు ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ.. రెవెన్యూ అధికారులు పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. యాలాల గ్రామం చుట్టూ పురాతన కాలం నాటి కోటగడ్డ ఉందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పలువురు వాటిని ధ్వంసం చేసి ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. కోటగడ్డ పరిరక్షణలో రెవెన్యూ అధికారులు స్పందించకపోతే గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ మండల కమిటీ సమావేశం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండల కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ చెప్పారు. సమావేశానికి పార్టీ ముఖ్యనాయకులు, అన్ని గ్రామాల అధ్యక్షులు, బూత్‌కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ అధ్యక్షులు విధిగా హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30గంటల వరకు హాజరుకావాలన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

పరిగి: మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు నిరుపేదలకు సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు సదర్ ఇ మిలాద్ ఖాజి ఖాజా అజారుద్దీన్ ఖాద్రి మాట్లాడుతూ చలితీవ్రత ఎక్కువ కావడంతో పట్టణ కేంద్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై, బస్‌షెల్టర్‌లో చలికి వణుకుతూ నిద్రిస్తున్న వారికి, యాచకులకు దుప్పట్లను అందజేసి సేవా భావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు జహంగీర్, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



టాస్‌వేసి టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

యాలాల: క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఎం క్రికెట్ టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఆట ఆడాలన్నారు. ఉన్నత లక్ష్యంతో జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టోర్నీ మొదటి రోజు యాలాల, రాఘవపూర్ గ్రామ జట్ల మధ్య పోటీ జరిగింది. కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు మహిపాల్ తదితరులు ఉన్నారు.

పన్ను చెల్లించి సహకరించాలి: డీఎల్‌పీఓ



రశీదు అందజేస్తున్న డీఎల్‌పీఓ

యాలాల: గ్రామ పంచాయతీల్లో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని డీఎల్‌పీఓ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం చెన్నారంలో పన్ను సేకరణను ఆయన తనిఖీ చేశారు. ప్రజలు ఇంటి, గ్రంథాలయ పన్ను చెల్లించి సహకరించాలన్నారు. పన్నులు చెల్లించకపోతే పంచాయతీరాజ్ చట్ట ప్రకారం తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ సిస్తు చెల్లించి ఆదర్శ గ్రామంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నుంచి పన్ను వసూలు చేసి రశీదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు సాయిలు, పంచాయతీ కార్యదర్శి అనిరాజ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్



అమ్మవారి సన్నిధిలో స్వప్న

తాండూరు: పట్టణంలోని సాకర్‌పేట్‌లో వెలసిన రక్తమైసమ్మ దేవాలయంలో సోమవారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, పలువురు కౌన్సిలర్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చైర్‌పర్సన్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెంకన్నగౌడ్, నాయకులు వెంకటేశ్, శాంతుకుమార్, సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

బీటీ పనులు ప్రారంభం

దౌల్తాబాద్: తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ బంగ్లా తండా వరకు బీటీరోడ్డు పనులను సోమవారం జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీటీసీ అనురాధ, సర్పంచు మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి తండాను పంచాయతీలుగా ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృషితో మండలంలోని ప్రతి తండాకు బీటీ మంజూరు అవుతుందని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వారికి నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆ సంఘం నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. డీఏ, 317 జీవో విషయంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి

మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డికి విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. త్వరగా ఆ ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, మండల సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, తహసీల్దార్ షాహేదబేగం, ఎంపీడీఓ జయరాం, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవులు, ప్రధానకార్యదర్శి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో దోమ మండల పరిధిలోని గూడురు గ్రామం నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రగా వెళ్తున్న శివభక్తులకు ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య స్వాగతం పలికి మాట్లాడారు. శివమాలధరణ అనేది అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు.

మరో రెండేళ్లైనా పూర్తికాదు!

- నత్తనడకన సాగుతున్న రైల్వే అండర్ పాస్ వంతెన పనులు
- వానాకాలంలోగా పూర్తిచేయాలి: స్థానికులు



మొరంగపల్లి వద్ద కొనసాగుతున్న వంతెన పనులు

మోమిన్‌పేట: రైల్వే అండర్ పాసు బ్రిడ్జిని నెలలో పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చి రాక పోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామని అధికారులు, కాంట్రాక్టరు హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా.. పనుల్లో పురోగతి లేదు. పనులు నిలిచిన విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి.. అధికారులు, సదరు నిర్మాణదారుతో మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అవసరమైతే రూ.50 లక్షలు ఇస్తామని చెప్పగా.. ఒక నెలలో పూర్తి చేస్తామని నవంబరు9, 2022న హామీ ఇచ్చారు. మాట ఇచ్చి రెన్నెళ్లు గడిచినా ఐదు శాతం పనులు కూడా పూర్తికాలేదు. దీంతో పనులను పరిశీలించిన పరిసరప్రాంత ప్రజలు ఇలా పనులు కొనసాగితే.. ఇంకా రెండేళ్లైనా పూర్తికావని, నత్తేనయమంటూ వాపోతున్నారు.

రెండు నెలల నుంచి పది మీటర్లే..

మండల పరిధిలోని మొరంగపల్లి వద్ద తాండూరు వెళ్లే రహదారిలో రైల్వే అండర్ పాసు బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. రెండు సంవత్సరాలుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అండర్ పాసు బ్రిడ్జి కింది నుంచి మురుగు నీరు వెళ్లేందుకు కాలువ నిర్మించాలి. సీసీ గోడలు, సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. కాని కేవలం రెండు నెలల నుంచి 10మీటర్ల రాయిని మాత్రమే తొలగించారు. ఇలాగే ఇంకా రెండేళ్లు పనులు చేసినా.. పూర్తయ్యే విధంగా కానరావటం లేదని ఆ ఐదు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలంలో రాకపోకలకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, మళ్లీ వర్షకాలం వచ్చేలోపు పనులు పూర్తి చేసేలా ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోసారి బ్రిడ్జిని ఎంపీ పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న కలప ట్రాక్టర్

కుల్కచర్ల: అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం .. సోమవారం తెల్లవారుజామున ఘనాపూర్ గేటు సమీపంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు అటువైపుగా వెళ్తున్న కలప ట్రాక్టర్‌ను ఆపారు. కలప తరలించేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా.. డ్రైవర్ లేవని చెప్పారు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించారు. డ్రైవర్ కావలి వెంకటయ్య, ఓనర్ శేఖర్‌లపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గిరి తెలిపారు.

ఉత్తములు ఎక్కడికెళ్లినా గుర్తింపే



నాగేంద్రప్పను సన్మానిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

కుల్కచర్ల: ఉత్తమ ఉద్యోగి ఎక్కడికి వెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎస్‌ఐ గిరి అన్నారు. కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రప్ప.. పరిగికి బదిలీకాగా.. ఆయనను సోమవారం ఠాణాలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలతో ప్రజలతో సత్సంబంధాలను నెరుపుతూ విధి నిర్వహణలో కష్టపడి పనిచేసేవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. నాగేంద్రప్ప అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు.

శివమాల ధరించిన భక్తులు

కుల్కచర్ల: 41రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో మాలను ధరించి, భగవంతున్ని పూజించడం జరుగుతుందని కుల్కచర్ల మల్లికార్జున సేవా సమితి అధ్యక్షుడు చెన్నయ్య చెప్పారు. సోమవారం బండవెల్కిచర్ల గ్రామంలో పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు శివమాలను ధరించారు.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషిచేయాలి



టీఎస్‌యూటీఎఫ్ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్

కుల్కచర్ల: ఉపాధ్యాయ సంఘాలు విద్యావ్యవస్థ ఉన్నతికి కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిర్మలాపూర్ గ్రామ పరిధిలోని తన నివాసంలో రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు.. విద్యార్థుల ఉన్నతికి తీసుకోవాల్సిన అంశాలపై నిరంతరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శావుకు రమేష్, ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్, జిల్లా కార్యదర్శి రాములు, శంకర్, రాములు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త, గోశాల నిర్వాహకులు కృష్ణస్వామి వివేకానంద జీవితచరిత్రను విద్యార్థులకు వివరించారు. ఇంటర్, డిగ్రీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్‌ఐ రవిగౌడ్ ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ రాము, ప్రిన్స్‌పాల్ రమేష్, గాయత్రీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ అకాడమిక్ డైరెక్టర్ ప్రభాకర్ విట్టల, హిమాచల్‌ప్రదేశ్ సర్వసాధన ఆశ్రమ నిర్వాహకులు స్వామిజీ ఆచార్య అనిలేష్, నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ ప్రిన్స్‌పాల్ నరేశ్‌రాజ్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవచేయడమే లక్ష్యం



పండ్లు పంపిణీ చేస్తున్న రాజేశ్, లోకేశ్

దోమ: పాఠశాల విద్యార్థులకు సేవ చేయడమే తమ లక్ష్యమని మాజీ సర్పంచ్ కుమారులు రాజేశ్ యాదవ్, లోకేశ్ యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మాజీ సర్పంచ్ మల్లయ్య యాదవ్ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు విద్యార్థులకు పండ్లు, నోట్‌బుక్స్‌ను సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ రాములుతో కలసి పంపిణీ చేశారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధమని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిలాల్, షఫీ, ఉపాధ్యాయులు వెంకటయ్య, శివశంకర్, రుక్మిణి, శైలాజ, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పవన్ యాదవ్, పాఠశాలల చైర్మన్లు శ్రీనివాస్, అనంతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల అరెస్టు

తాండూరు: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలంటూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు విద్యార్థి సంఘం నాయకులను వారి ఇళ్లల్లోనే అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అనంతరం దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు హైకోర్టులో 7 మార్కులు కలపాలని ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ఇచ్చే నోటిఫికేషన్‌లు ఎన్నికల స్టంట్‌లో భాగమేనని విమర్శించారు.

బడీడు పిల్లల్ని స్కూల్లో చేర్పించాలి



కుల్కచర్ల: వివరాలు సేకరిస్తున్న గాంగ్యనాయక్

కుల్కచర్ల: గ్రామాల్లో బడి మానేసిన చిన్నారులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కుల్కచర్ల సీఆర్పీ గాంగ్యనాయక్ అన్నారు. సోమవారం తిర్మలాపూర్, అనంతసాగర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, సీఆర్పీ రమేష్‌లు డ్రాపౌట్స్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన బాలున్ని గుర్తించి పాఠశాలలలో చేర్పించి మాట్లాడారు. బడీడు పిల్లలందర్నీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

కొడంగల్ రూరల్‌లో

కొడంగల్ రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్‌పీ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని పాతకొడంగల్, పాతకొడంగల్ తండాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. 6నుంచి 14ఏళ్లలోపు చిన్నారులను గుర్తిస్తూ వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తండాలో 11ఏళ్ల పూజ అనే బాలికను గుర్తించి, పాఠశాలలో చేరాలని చెప్పారు. కార్యక్రమంలో తండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

మర్పల్లి: పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కొంషెట్‌పల్లి, దార్గులపల్లి, తుమ్మలపల్లి, బిల్‌కల్ గ్రామాల్లో పల్లె పల్లెకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. పార్టీ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్లు రఫి, సురేష్, లక్ష్మారెడ్డి, రాచన్న, మధుసుదన్‌రెడ్డి, నగేశ్, ప్రభాకర్, మాజీ ఎంపీపీ నర్సింహులు, మైనార్టీసెల్ మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్, జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, మండల వైస్ ప్రసిడెంట్ సలీం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ నసీరొద్దిన్, పట్లూర్ ఎంపీటీసీ మహేశ్, రావులపల్లి సర్పంచ్ అబ్రహం, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

చిన్న చేతులు పెద్దసాయం



సంస్థ ప్రతినిధికి విరాళం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: సోచ్(ఎస్‌ఓసీహెచ్) ఫౌండేషన్ కో ఆర్డినేటర్ బాలాజీకి పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ విద్యార్థులు పోగు చేసిన రూ.25,710 లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడల్స్, మెమొంటోస్, సర్టిఫికెట్లు అందజేశారు. అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ పనిచేస్తుందని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు వెంకటయ్య, ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథలకు 'అప్నాఘర్'

తాండూరు: అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకే 'అప్నాఘర్ చైల్డ్ కేర్ సెంటర్‌ను స్థాపించామని ప్రముఖ వ్యాపారి అబ్దుల్ అహ్మద్ తెలిపారు. 'ఖైసరున్నీసా చైల్డ్‌కేర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అప్నాఘర్‌ను నిర్వహించడం జరుగుతోందన్నారు. కులమతాలకు అతీతంగా సంస్థను నిర్వహిస్తున్నామని, మూడేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసున్న బాలబాలికలను ఆదరిస్తామని పేర్కొన్నారు. పిల్లలను అప్నాఘర్‌కు దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేయిస్తున్నామని వెల్లడించారు. అనాథ పిల్లలను అప్నాఘర్‌లో చేర్పించాలనుకునే వారు 9505268832, 9951813102, 9848922642 నంబర్లను సంప్రదించాలని సూచించారు.